

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. - 10లో



బీజేపీకి పుట్టగతులుండవు

కృష్ణానదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకుంటే బీజేపీకి పుట్టగతులుండవని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
34° / 23°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నల్లగొండ మార్కెట్ చైర్మన్‌గా పంకజ్‌యాదవ్



నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చీర పంకజ్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయనతోపాటు వైస్ చైర్మన్ మరో 16 మంది సభ్యుల నియమిస్తూ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంకజ్‌యాదవ్ 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొని జైల్‌కు వెళ్లారు. ఆయన తండ్రి వెంకటేశ్వర్‌రావు కూడా తొలిదశ ఉద్యమంలో పాల్గొన్నారు. 2000 సంవత్సరంలో పంకజ్‌యాదవ్ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రొఫెసర్ జయశంకర్ సార్‌తో కలిసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే పంకజ్‌యాదవ్ భార్య జయలక్ష్మి కూడా ఉద్యోగానికి రాజీనామా చేశారు. పంకజ్‌యాదవ్ 2001లో కేసీఆర్ స్థాపించిన టీఆర్‌ఎస్‌లో చేరి.. మలిదశ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 2002 నుంచి 2014వరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారు.

మార్కెట్ కమిటీ ఇదే..

చైర్మన్‌గా చీర పంకజ్‌యాదవ్, వైస్ చైర్మన్‌గా దొంతం ఇంద్రసేనారెడ్డి, సభ్యులుగా కందికొండ జానయ్య, చింతకింది శంకరయ్య, ఇస్లావత్ హనుమంతు, దేప అమరేందర్‌రెడ్డి, సయ్యద్ అజాజ్, పనస శ్రీనివాస్, రొయ్య సైదులు, మల్లెబోయిన బుచ్చిరాజు, కొండ స్వరూప, గడగోజు సత్యనారాయణ, ఎలిశాల వెంకటేశం, గుండ రమేష్‌బాబు, కనగల్ పీఏసీఎస్ చైర్మన్‌తోపాటు నల్లగొండ మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ ఏడీ, నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉమ్రా యాత్ర ముస్లింలకు పవిత్రమైనది



ఉమ్రా యాత్రను ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఖాజీ అధ్యక్షుడు ఇక్రముల్లా

రామగిరి(నల్లగొండ) : ముస్లింలకు ఉమ్రా యాత్ర పవిత్రమైనదని తెలంగాణ రాష్ట్ర ఖాజీ అధ్యక్షుడు ఇక్రముల్లా అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మదీనా మసీదు నుంచి ఉమ్రా యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 15 రోజుల పాటు సాగే ఈ యాత్ర వారం రోజులు మక్కాలో, మరో వారం రోజులు మదీనాలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ బషీర్, జాఫర్, అశ్వక్, నిజాం, ఫరీద్, మసీదు ప్రెసిడెంట్ గఫార్, ఉపాధ్యక్షుడు జానీ, డాక్టర్ ఇనహిద్‌ఖాన్, సోహెల్, అబ్దుల్ మాలిక్, ఫైజాన్‌మా, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

మాడుగులపల్లి : వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీల ఏర్పాటుకు సంబంధించిన అనుమతి పత్రాల చూపించాలంటూ భూ యజమానులకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 25న సాక్షిలో 'ఇటుక బట్టీల్లో జీవితాలు బుగ్గి' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూశాఖ స్పందించింది. సోమవారం మాడుగులపల్లి మండలంలోని గంధ్రవానిగూడెం, తోపుచర్ల గ్రామాల పరిధిలో ఇటుక బట్టీలో తనిఖీలు నిర్వహించింది. పలువురు వ్యవసాయ భూములను నాలా బదిలీ చేయకుండా బట్టీల వ్యాపారులకు అద్దెకిచ్చినట్లు గుర్తించింది. వీరు రైతుబంధు పథకం ద్వారా లబ్ధి సైతం పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నట్లు తేల్చింది. ఈ మేరకు పూర్తి అనుమతి పత్రాలు చూపాలంటూ భూ యజమానులకు సోమవారం నోటీసులు జారీ చేసింది. వారంలోగా అన్ని ఆధారాలు చూపుతూ రాతపూర్వక సంజాయిషీ ఇవ్వాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంది.

ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్ : ఎడ్‌సెట్ 2023 దరఖాస్తు గడువును ఈనెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ, ఎడ్‌సెట్ చైర్మన్ గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6వ తేదీలోగా అందించాలని కోరారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తక్కువ పరీక్ష కేంద్రాలు ఉన్నందున సకాలంలో దరఖాస్తు చేసుకుంటే సమీపంలోనే పరీక్ష కేంద్రం కేటాయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మళ్లీ 'అన్నల' అలికిడి!

- గణేశ్ అరెస్టుతో జిల్లాలో మావోయిస్టులపై చర్చ
- హైదరాబాద్‌లో పరిచయంతోనే మావోయిస్టులవైపు చెన్నగోని గణేశ్
- కొమురంభీం జిల్లాలో జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు సరఫరా చేస్తున్నారని అరెస్ట్
- గణేశ్ స్వగ్రామం మునుగోడు మండలం కొరటికల్
- చాపకింద నీరులా మావోల రిక్రూట్‌మెంట్‌పై పోలీసుల ఆరా
- నల్లగొండ జిల్లా నుంచి అజ్ఞాతంలో పది మంది



మావోయిస్టుల్లో చేరే వారు లేరనుకుంటున్న తరుణంలో..

ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో చేరే యువత లేరనుకుంటున్న తరుణంలో 22 ఏళ్ల గణేశ్ అరెస్టు చర్చనీయాంశంగా మారింది. గణేశ్‌ది నిరుపేద కుటుంబం. హైదరాబాద్‌లో ఉండి చదువుకుంటున్న గణేశ్ ఇలా మావోయిస్టుల వైపు ఆర్షితుడు కావడం వెనుక బంధువులు, గ్రామంలో ఒకప్పటి మూలాలే కారణం కావచ్చన్న చర్చ జరుగుతోంది. అయితే అరెస్టుకు మూడు రోజుల ముందు గణేశ్ గ్రామంలోనే ఉన్నాడని, అక్కడి నుంచే పోలీసులు తీసుకెళ్లారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో మళ్లీ మావోయిస్టుల అలికిడి మొదలైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దశాబ్దకాలంగా లేని మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ మళ్లీ మొదలు కావడం చర్చనీయాంశంగా మారింది. మునుగోడు మండలం కొరటికల్‌కు చెందిన చెన్నగోని గణేశ్ అరెస్టు కావడంతో కలకలం రేగింది. నిరుద్యోగ సమస్యతో సతమతమవుతూ యువత అర్బన్ నక్సలిజం వైపు అడుగులేస్తున్నారా? అంటే అవుననే వాదన అంతర్గతంగా వినిపిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా యువత అర్బన్ నక్సలిజం పట్ల ఆకర్షితులు అవుతున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. గణేశ్ అరెస్టే ఇందుకు ఉదాహరణ అన్న చర్చ సాగుతోంది. పదేళ్లుగా జిల్లాలో మావోయిస్టుల కార్యకలాపాలు పెద్దగా లేవు. ఒకప్పుడు జిల్లా నుంచి వందల సంఖ్యలో మావోయిస్టులు ఉండగా, వారిలో అనేక మంది ఎన్‌కౌంటర్లలో చనిపోవడం, అరెస్టు కావడం, లొంగిపోవడంతో ఇప్పుడు అజ్ఞాతంలో ఉన్న వారి సంఖ్య పది మందిలోపే ఉన్నట్లు పోలీసులు వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఇప్పుడు వారందరూ బతికే ఉన్నారా? లేరా? అన్నది పోలీసులు స్పష్టంగా చెప్పలేని పరిస్థితుల్లో గణేశ్ అరెస్టు కలకలం రేపుతోంది.

అసలేం జరిగింది?

పోలీసుల కథనం ప్రకారం.. మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన చెన్నగోని గణేశ్ (22) నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడి చెన్నై అమృత కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన గణేశ్ హైదరాబాద్ క్యాటరింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే ఎంఏ ఫిలాసఫీ పూర్తి చేసిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం జల్దెడ గ్రామానికి చెందిన కోట ఆనందరావు (26) హైదరాబాద్ అద్దె గదిలో ఉంటూ తను కూడా క్యాటరింగ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కుల నిర్మూలన వేదికలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆనందరావు మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లోనూ సహకరిస్తున్నాడు. ఈ క్రమంలో ఏడాది కిందటే ఆనందరావుతో గణేశ్‌కు పరిచయం ఏర్పడింది. ఆనందరావు ఇచ్చిన నక్సల్స్ సాహిత్యం చదివి ఆకర్షితుడైన గణేశ్‌ను కూడా గత నెల 3వ తేదీన పార్టీలో చేర్పించాడు. దళం వద్దే వారం పాటు ఉన్న గణేశ్ తరువాత జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు వంటి పేలుడు పదార్థాలు తీసుకురావడానికి వెళ్లి ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఆగర్‌గూడ వద్ద ఏప్రిల్ 28వ తేదీన అనందరావుతోపాటు పోలీసులకు దొరికిపోయాడు. 29వ తేదీన పోలీసులు అరెస్టు చూపించారు. ఒకప్పుడు రాచకొండ దళానికి షెల్టర్ జోన్‌గా ఉన్న కొరటికల్ గ్రామానికి చెందిన గణేశ్ మావోయిస్టుల్లో చేరి దొరికిపోవడంతో కలకలం రేపింది.

మిగిలింది కొద్ది మందే..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో మావోయిస్టులు ఉండగా, పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. అరెస్టు అయినవారు, లొంగిపోయిన వారు వందల సంఖ్యలో ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాకు చెందిన వారు పార్టీలో ఉన్నది పది మందిలోపే. వారిలో ప్రధానంగా చండూరు మండలం పుల్లెంలకు చెందిన పాక హనుమంతు అలియాస్ రాజేష్ తివారి 1983 నుంచి అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. ఒకసారి ఎన్‌కౌంటర్ చనిపోయారని అనుకున్నా.. తరువాత ఆయన బతికే ఉన్నారన్న సమాచారం పోలీసులకు ఉంది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఉన్న హనుమంతుపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన మందుగుల భాస్కరరావు 1991 నుంచి అజ్ఞాతంలో కొనసాగుతున్నాడు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యునిగా పనిచేస్తున్నాడు. జిల్లాకు చెందిన కొద్దిమంది కూడా చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోనే పని చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

కదంతొక్కిన కార్మికలోకం



మే డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

బీఆర్‌ఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- మునుగోడులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మునుగోడు : సీమాంధ్ర పాలకుల కారణంగా గ్రామాల్లో పేరుకుపోయిన అనేక ప్రజా సమస్యలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారానే పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మునుగోడులో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఆయన.. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేందుకు క్యాంపు కార్యాలయాలు నిర్మించారని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి ఎమ్మెల్యే స్థానికంగా ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లో పనిచేసిన ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో ఉండి అమాస, పున్నానికి నియోజకవర్గాలకు వచ్చి కొబ్బరికాయలు కొట్టి తిరిగి పట్టణాలకు వెళ్లేవారని ఎద్దేవా చేశారు.



ప్రజలు స్థానికంగా క్యాంపు కార్యాలయం వద్ద ఉండే ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, చండూరు జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, చండూరు మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, బొమ్మరబోయిన వెంకన్న, దంటు జగదీశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని కార్యాలయంలో కుర్చీలో కూర్చోబెడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రారంభోత్సవానికి హాజరుకాని నేతలు

మునుగోడులో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు చాలా మంది గైర్హాజరయ్యారు. దీంతో ఆ నేతలు ఎందుకు హాజరు కాలేదనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా మొదలైంది. గైర్హాజరైన వారిలో మునుగోడు, నాంపల్లి, నారాయణపురం, మర్రిగూడ జెడ్పీటీసీలు నారబోయిన స్వరూపరాణిరవి, ఏలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, వీరమళ్ల భానుమతి వెంకటేష్, పాశం సురేందర్‌రెడ్డి, చండూరు, మర్రిగూడ, నారాయణపురం, నాంపల్లి ఎంపీపీలు పల్లె కళ్యాణిరవికుమార్, ఉమాదేవి ప్రేమ్‌చందర్‌రెడ్డి, ఏడుదొడ్ల శ్వేతా రవీందర్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వేనేపల్లి వెంకటేశ్వర్‌రావు, కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి, పల్లె రవికుమార్, అనంత రాజుగౌడ్, జేల్లా మార్కండయ్యతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

మిర్యాలగూడ : రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని అవంతీపురం మార్కెట్ యార్డు, వెంకటాద్రిపాలెం ఐకేపీ కేంద్రాన్ని ఆయన సందర్శించి కొనుగోళ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. సరోజ, వెంకటేశ్వర, వెంకటరమణ రైస్‌మిల్లులను తనిఖీ చేసి జీరో దిగుమతి ఉండడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ కేటాయించిన రైస్‌మిల్లులన్నీ తప్పనిసరిగా ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. జీరో దిగుమతి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతి, మిల్లర్లు దిగుమతి చేసుకునే ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేనందున కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండడంతో అకాల వర్షాలకు తడిసే ప్రమాదం ఉన్నందున్న వెంటవెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. అందుకు అవసరమైన లారీలను కాంట్రాక్టర్లతో మాట్లాడి అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఎంపీఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ సురేందర్‌సింగ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాధితులకు భరోసా ఇవ్వాలి

నల్లగొండ క్రైం : పోలీస్ గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ అపూర్వరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆమె ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా దర్యాప్తు చేయాలని సూచించారు. బాధితులకు భరోసా కల్పిస్తేనే పోలీస్ శాఖపై నమ్మకం కలుగుతుందని చెప్పారు. అధిక వడ్డీలు, ఉద్యోగులు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేయడం, సంఘాల పేరిట సెటిల్మెంట్ చేయడం, భయభ్రాంతులకు గురిచేసే వారిపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

427 మందికి ప్రయోజనం

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీఓ విడుదల



నల్లగొండలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

నల్లగొండ : ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సంతకం చేసి వారికి తీపికబురు అందించారు. అందుకు సంబంధించి జీఓ నంబర్ 38 కూడా విడుదలైంది. జిల్లాలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు 345 మంది, వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు 82 మందికి ముఖ్యమంత్రి నిర్ణయంతో ఉద్యోగాలు రెగ్యులరైజ్ కానున్నాయి.

గతంలోనే హామీ..

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని గతంలోనే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అందులో భాగంగా 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమబద్ధీకరణకు పూనుకోగా కొందరు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియలో జాప్యం జరిగింది. దీంతో ప్రభుత్వం వారి వేతనాలను రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పెంచింది. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయడంతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ప్రజల బాధలు పట్టించుకోని సర్కార్

- బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నిజాం పాలనకు ఏమాత్రం తేడా లేదు
- కేసీఆర్‌ను గద్దె దించేందుకు మరో పోరాటానికి సన్నద్ధం కావాలి
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క



ఆలేరు నుంచి కొలనుపాకకు పాదయాత్రగా వెళ్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, నాయకులు

ఆలేరు రూరల్ : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనకు అనాటి నిజాం పాలనకు ఏ మాత్రం తేడా లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో కొలనుపాక రోడ్డులో పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం కొలనుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. తినడానికి తిండి లేక ఆకలి కేకలతో అలమటిస్తున్న ప్రజలను హింసించి వారి సంపదను దోపిడీ చేసి ఆనాడు నిజాం రాజు రాజభవనాలు నిర్మించాడని, ఈనాడు సీఎం కేసీఆర్ కూడా రాష్ట్రంలో ప్రజలు సమస్యలు పరిష్కరించకుండా తెలంగాణ తలెత్తుకునే విధంగా సెక్రటేరియట్ నిర్మించామని ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆలేరు వరకు కొనసాగిన తన పాదయాత్రలో అనేక గ్రామాల్లో ప్రజలు తినడానికి తిండిలేక ఉండటానికి ఇళ్లు లేక ఇబ్బందులు పడుతుండడం చూశానని అన్నారు. బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, బీఈడీలు చదివిన విద్యార్థులు కొలువులు రాక ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్ అద్భుతంగా సెక్రటేరియట్ కట్టామని మట్లాడటం బాధాకరమన్నారు. నిజాం రాచరిక నియంతృత్వ నిరంకుశ మనస్తత్వం కలిగిన కేసీఆర్‌ను గద్దె దించటానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో ప్రజలు మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సంపదను కేసీఆర్ కుటుంబం, ప్రభుత్వ పెద్దలు దోపిడీ చేస్తుండగా ప్రజల సంపద ప్రజలకే చెందాలని చేస్తున్న పోరాటమే ఈ పాదయాత్ర అని భట్టి అన్నారు. కాగా, ఆలేరులో పంక్చర్ దుకాణదారుడు సోమ రమేష్ తన గోడును భట్టివిక్రమార్కకు వినిపించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తమకు అన్ని సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు ఏమీ అందడం లేదని చెప్పాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కల్లూరి రామచంద్రారెడ్డి, అన్నం సంజీవరెడ్డి, కుడుదుల నగేష్, ఎంపీపీ అశోక్, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సునీతశ్రీనివాస్‌రెడ్డి, సాగర్, శ్రీకాంత్, ఆంజనేయులు, లోకేష్, అజయ్, జాహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



రాజాపేట : రఘునాథపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

దూదివేంకటాపూర్‌లో ఘన స్వాగతం

రాజాపేట: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం రాత్రి రాజాపేట మండలంలోని దూదివేంకటాపురం గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి : సీతక్క

తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. భట్టి విక్రమార్కతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజా రంజకమైన పాలన అందిస్తుందని అన్నారు. నాడు భూదానోద్యమం ఉంటే నేడు తెలంగాణలలో నయా భూస్వామి వ్యవస్థ వచ్చిందన్నారు.

నేడు పీపుల్స్ మార్చ్ ఇలా..

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామం నుంచి ప్రారంభం కానుంది. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి, మాసాయిపేట, సైదాపురం మీదుగా యాదగిరిగుట్ట వరకు కొనసాగనుంది. రాత్రి భట్టి విక్రమార్క యాదగిరిగుట్టలో కార్నర్ మీటింగ్ నిర్వహించి, అక్కడే బస చేస్తారు.

పాల్గొనని డీసీసీ అధ్యక్షుడు

భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సోమవారం డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. మొదటి రోజు పాదయాత్రలో భాగంగా ఆలేరులో నిర్వహించిన కార్నర్ సమావేశంలో సభా వేదికపై భట్టి విక్రమార్క ఎదుటనే అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య వాగ్వాదం చేసుకున్న విషయం తెలిసిందే.

క్లుప్తంగా

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మిర్యాలగూడ: దామరచర్ల మండల పరిధిలోని వాడపల్లి వద్ద కృష్ణానది ఒడ్డున సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వాడపల్లి ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వాడపల్లి వద్ద కృష్ణానది ఒడ్డున స్థానిక మత్స్యకారులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటాయని, లుంగి, ముదురు గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడని, కుడి కాలు, కుడి చేతికి చేపలు పట్టే వల చిక్కుకుని ఉందని పేర్కొన్నారు. మృతుడు మూడు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి కృష్ణానదిలో మునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని యువకుడి మృతదేహం

నల్లగొండ క్రైం: రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు సోమవారం రైల్వే ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ-రాయినిగూడెం మధ్యన రైలు పట్టాల పక్కన 71వ మైలు రాయి వద్ద ఓ యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఆదివారం రాత్రి రైలు నుంచి జారి పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెంది ఉండవచ్చని, మృతుడి వయస్సు సుమారు 25ఏళ్లు ఉంటాయని, అతడి కుడిచేతి మణికట్టుపై నక్షత్రం ఆకారంలో పచ్చబొట్టు ఉందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపారు. మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు 9440627529 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సింగారంలో దొంగల బీభత్సం

- ఒకే రాత్రి 14 ఇళ్లలో చోరీ
- గ్రామ శివారులో తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- 8 తులాల బంగారు, 230 తులాల వెండి ఆభరణాలు, రూ.2.80లక్షల నగదు అపహరణ
- ఆధారాలు సేకరించిన క్లూస్‌టీం


గ్రామంలోని ఓ ఇంట్లో బీరువా పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడేసిన దొంగలు


గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న భువనగిరి ఏసీపీ నర్సింహారెడ్డి

రాజాపేట: ఒకే రాత్రి 14 ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడిన ఘటన రాజాపేట మండలంలోని సింగారం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన చింతల చంద్రయ్య, న్యారమైన కనకయ్య, కుక్కల కిష్టయ్య, చింతల ఐలయ్య, బోనాల వెంకటయ్య, బత్తుల లింగయ్య, ఇద్దెల భూలక్ష్మి, గుర్రాల బాలమల్లు, మడూరి పద్మ, బొల్లారం ఎల్లమ్మ, బొల్లారం నర్సయ్య, వంపు బాలనర్సయ్య, కుక్కల ఎల్లమ్మ, బత్తుల కిష్టమ్మ తమ ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లారు. అయితే ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ 14 మంది ఇళ్ల తాళాలను పగులగొట్టి లోపలికి చొరబడి చేతికి అందినకాడికి దోచుకెళ్లారు. సోమవారం ఉదయం గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితులు గ్రామానికి వచ్చి బోరున విలపించారు. మొత్తం కలిపి సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, 230 తులాల వెండి ఆభరణాలు, రూ.2.80లక్షల నగదును దొంగలు దోచికెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. ఏక కాలంలో 14 ఇళ్లలో చోరీ జరిగే సరికి ఇంటికి తాళం వేసి పొరుగూరికి వెళ్లాలంటేనే గ్రామస్తులు జంకుతున్నారు.

తాళాలు వేసిన శివారు ఇళ్లే టార్గెట్..

చోరీ జరిగిన తీరును గమనిస్తే గ్రామ శివారులో తాళాలు వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. దోచుకున్న సొత్తును సొల్వాపురం వెళ్లే దారిలో గ్రామ శివారులోని ఓ గుడిసె వద్ద దొంగలు పంచుకున్నట్లు ఆధారాలు దొరికాయని పోలీసులు తెలిపారు.

బంధువుల ఇళ్లకు, శుభకార్యాలకు..

బత్తుల శ్రీశైలం, ఇద్దెల భూలక్ష్మి మాత్రం గ్రామం నుంచి వేరే ప్రాంతానికి వలస వెళ్లగా, మిగతా బాధితులంతా తమ ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లలో శుభకార్యాలకు, తమ బంధువుల ఇళ్లకు వెళ్లినట్లు తెలిసింది. వీరిలో కొందరు ఆదివారం రాత్రి 7గంటల వరకు ఇళ్లలోనే ఉండి ఆ తర్వాత తాళం వేసి వెళ్లినట్లు పేర్కొన్నారు. బోనాల వెంకటయ్య తన భూమి పట్టా చేసుకునేందుకు ఇంట్లో దాచుకున్న రూ.లక్షతో పాటు తన కుమార్తె రాజమణి భర్త చనిపోతే ఆమె సుమారు 70 తులాల పట్టగొలుసులు, నడుము గొలుసు, మెడ గొలుసు, తులం కమ్మలు, వంకు తల్లిగారింట్లో దాచుకోగా దొంగలు ఎత్తుకెళ్లారని బోరున విలపించింది.

విచారణ చేపట్టిన పోలీసులు

ఏకకాలంలో 14 ఇళ్లలో చోరీలు జరగడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. భువనగిరి ఏసీపీ నర్సింహారెడ్డి, భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ సురేందర్‌రెడ్డి, రాజాపేట, ఆలేరు, గుండాల ఎస్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, యాకన్న, వెంకటశ్రీను, పోలీస్ సిబ్బంది బాధితులతో పాటు గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా గ్రామంలో చోరీలు జరుగుతూనే ఉన్నాయని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఆటో బోల్తా

- నలుగురికి గాయాలు
- క్షతగాత్రుల్లో ముగ్గురు చిన్నారులు


రోడ్డు పక్కన బోల్తా పడ్డ ఆటో

వేములపల్లి: లారీ ఢీకొని ఆటో బోల్తా పడడంతో ఒక మహిళ, ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం వేములపల్లి శివారులోని గంగదేవమ్మ ఆలయ సమీపంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన 10 మంది తెలంగాణలోని మంచిర్యాల పట్టణంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆటోలో ఐదురోజుల క్రితం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉదయం వేములపల్లి శివారుకు చేరుకోగానే ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళతో పాటు ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వేములపల్లి ఎస్‌ఐ శ్రీనయ్య పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- చిట్యాల పట్టణంలో ఒకరు
- మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామంలో మరొకరు..

చిట్యాల: పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం(ఒకటో వార్డు)కు చెందిన నూతి శ్రీను(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను ఆదివారం పని నిమిత్తం బైక్‌పై నార్కట్‌పల్లికి వెళ్లి రాత్రి తిరిగి చిట్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి జంక్షన్ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు శ్రీను ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడి భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి..


శేఖర్ (ఫైల్)

మునుగోడు: బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి చెట్టుని ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని చీకటిమామిడి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం వాయిలపల్లి గ్రామానికి చెందిన వంగూరి శేఖర్(30) ఆదివారం ఉదయం మునుగోడు మండలంలోని జక్కలవారిగూడెంలో తన బంధువుల శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. రాత్రి 10 గంటల తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చీకటిమామిడి గ్రామ సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుని ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం మృతుడి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మునుగోడు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణం

భువనగిరి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భువనగిరి పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం జమీలాపేటకు చెందిన జిట్టజోజు కళ్యాణ్‌చారి(24) భువనగిరి పట్టణంలో ఓ మొబైల్ షాపులో పనిచేస్తూ స్థానికంగానే ఓ భవనం పెంట్‌హౌజ్‌పై దేశగాని రాజేష్‌కుమార్‌తో కలిసి అద్దెకు ఉంటున్నాడు. గత నెల ఏప్రిల్ 27న రాజేష్‌కుమార్ తన తండ్రికి ఆరోగ్యం బాగోలేదని చెప్పి సొంతూరుకు వెళ్లాడు. కాగా సోమవారం రాజేష్‌కుమార్ స్నేహితుడు నక్క లక్ష్మణ్ బైక్ తాళంచెవి కోసమని కళ్యాణ్‌చారి రూంకు వెళ్లాడు. ఎంతసేపు డోర్ కొట్టినా కళ్యాణ్‌చారి తలుపు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు. కళ్యాణ్‌చారి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు.

గంగసానిపల్లి సమీపంలో మరొకరు..

మండలంలోని గంగసానిపల్లి సమీపంలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగసానిపల్లికి చెందిన బంటు ప్రవీణ్(25) ఆదివారం చీమలకొండూరులో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం అయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదు. కాగా ప్రవీణ్ గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అదే వెంచర్‌కు ప్రవీణ్ తండ్రి స్వామి వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, సోమవారం ఉదయం ఆయన ప్రవీణ్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. కాగా ప్రవీణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని బంధువుల ఆందోళన
- సూర్యాపేట పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘటన

సూర్యాపేట క్రైం: వైద్యుల నిర్లక్ష్యంతోనే నవజాత శిశువు మృతిచెందిందంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని యడవెల్లి గ్రామానికి చెందిన శ్రీవాణికి పురిటి నొప్పులు రావడంతో గత నెల 27న భర్త మహేష్ సూర్యాపేటలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అడ్మిట్ చేశాడు. అదేరోజు రాత్రి శ్రీవాణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన వెంటనే శిశువుకు సీరియస్‌గా ఉందని డాక్టర్లు ఐసీయూకి తరలించారు. శిశువుకు ఎందుకు సీరియస్‌గా ఉందని వైద్యులను శ్రీవాణి కుటుంబ సభ్యులు నిలదీశారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న శిశువు సోమవారం మృతిచెందింది. అయితే ఆపరేషన్ చేసే సమయంలో తాను మూత్రం ఆపుకోలేకపోవడంతో తన కడుపు భాగంపై వైద్యులు గుద్ది దుర్భాషలాడారని శ్రీవాణి కుటుంబ సభ్యులకు తెలిపింది. కాగా శిశువు మృతికి వైద్యులే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు.

చాయ్‌వాలా.. దేశాన్ని అమ్మేస్తున్నాడు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: చాయ్‌వాలాగా చెప్పుకుంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అమ్మేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఫ్లైఓవర్ నుంచి రాజీవ్ చౌక్ మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకు కార్మికులతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అవలంబిస్తున్న విధానాల వలన దేశ భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ ప్రజలకు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, దేవుళ్ల పేరుతో ప్రజల మధ్య మత విద్వేశాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. మోదీని గద్దె దించి దేశ భవిష్యత్తు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మే డే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, మంగారెడ్డి, రెమడాల పరశురాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, పాదూరి గోవర్ధని, రామ్మూర్తి, వినోద్‌నాయక్, అయ్యూబ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అముదకు ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: క్యాన్సర్‌తో బాధపడుతున్న అముద గురించి సాక్షి దినపత్రికలో గత నెల 26న 'అయ్యో అముద' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆస్ట్రేలియాలో ఉంటున్న తుమ్మల రమేష్‌రెడ్డి రూ.50వేల ఆర్థికసాయాన్ని పంపించారు. అమెరికాలో ఉంటున్న కోదాడకు చెందిన జలగం సుధీర్ సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని చూసి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం వెబ్ సైట్‌లో పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన తుమ్మల రమేష్‌రెడ్డి రూ.50వేల ఆర్థికసాయాన్ని సోమవారం అముదకు అందించారు. అముద క్యాన్సర్ చికిత్స చేయించేందుకు మరికొంత మంది ఎన్‌ఆర్‌ఐలు చేయూత అందించే విధంగా చూస్తానని జలగం సుధీర్ సాక్షితో చెప్పారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ఆంజనేయస్వామి ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామన్నపేట: మండలంలోని బోగారం గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రహరీ దూకి ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి భక్తులు సమర్పించిన కానుకలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఆలయం వద్దకు వెళ్లిన భక్తులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రామన్నపేట, వలిగొండ ఎస్‌ఐలు లక్ష్మయ్య, ప్రభాకర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు.

గుంతలో పడి వ్యక్తి మృతి

గుర్రంపోడు: ఏఎమ్మార్పీ కాలువ పక్కన గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చామలేడు గ్రామ సమీపంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సనాథర్(50) ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు ఇక్కడకు వలస వచ్చి 15 ఏళ్ల క్రితం చామలేడు గ్రామానికి చేరుకున్నాడు. అతడిని గ్రామానికే చెందిన సంగం గణేష్ చేరదీయగా, అప్పటి నుంచి అతడు గణేష్ వద్దనే ఉంటూ గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన సనాథర్ గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ కాల్వ పక్కన గుంతలో విగతజీవిగా గ్రామస్తులకు కనిపించాడు. అనాథ అయిన సనాథర్ అంత్యక్రియలను సోమవారం సంగం గణేష్ కుటుంబ సభ్యులే నిర్వహించారు.

బైక్‌ల చోరీకి పాల్పడుతున్న యువకుల అరెస్ట్

- బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఇద్దరిని..
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


బీబీనగర్: పోలీసులకు పట్టుబడిన యువకులు, బైకులు


సూర్యాపేట క్రైం: నిందితుడిని, బైక్‌లను చూపుతున్న డీఎస్పీ నాగభూషణం, సిబ్బంది

బీబీనగర్: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు యువకులను సోమవారం తెల్లవారుజామున బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర విలేకరులకు ప్రెస్‌నోట్ ద్వారా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన కర్రె వెంకటేష్, పాలగాని వంశీ సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. సోమవారం ఉదయం వారిద్దరూ తాము దొంగిలించిన రెండు బైక్‌లతో గూడూరు టోల్‌ప్లాజా గుండా హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో టోల్‌ప్లాజా వద్ద బీబీనగర్ ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు వారిద్దరిపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా, బైక్‌లను దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో నిందితులతో పాటు వారు దొంగిలించిన బైక్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా ఇటీవల నిందితులు దొంగిలించిన మరో ఐదు బైకులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పేర్కొన్నారు.

సూర్యాపేటలో మరొకరు..

సూర్యాపేట క్రైం: జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్న బైక్ మెకానిక్‌ను సోమవారం సూర్యాపేట పట్టణంలో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నాగభూషణం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన పందిరి ప్రదీప్‌రెడ్డి అలియాస్ చింటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన అతడు ఇటీవల హుజూర్‌నగర్‌లో బైక్ చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ తన తీరు మార్చుకోకుండా మళ్లీ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కాగా సూర్యాపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో బైక్‌ను అపహరించిన అతడు కొత్త బస్టాండ్ వద్ద దానిని విక్రయించేందుకు సోమవారం బేరసారాలు ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ పట్టణాల్లో మొత్తం 11 బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. 11 బైకులను స్వాధీనం చేసుకుని.. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ గొర్ల కృష్ణ, గోదేషి కరుణాకర్, సైదులు, ఆనంద్, మధు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ నిర్వహణలో జాగ్రత్తలు అవసరం

- కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత


డ్రిప్ విధానంలో సాగు చేస్తున్న పామాయిల్ తోటలు

పాడి పంట

నడిగూడెం: రాయితీతో తీసుకునే సూక్ష్మ సేద్యపు పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్లు) రెండోసారి తీసుకోవాలంటే ఏడేళ్లు ఆగాల్సి ఉంటుంది. అంతవరకు వాటిని జాగ్రత్తగా వాడుకోవాలని, ప్రస్తుత వేసవిలో జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత చెబుతున్న సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే.... ఒకసారి పొలంలో అమర్చుకున్న డ్రిప్ పరికరాలను జాగ్రత్తగా వాడుకోవాలి. వాటి పనితీరు, చిన్నపాటి మరమ్మతులు గురించి అవగాహన కలిగి ఉండాలి. డ్రిప్ సిస్టమ్ హెడ్ కంట్రోల్ యూనిట్‌లో వివిధ రకాల ఫిల్టర్లు నీటిలోని ఇసుక, ఆల్గే(నాచు) చెత్త, మలినాలు వేరు చేసేందుకు అమర్చబడి ఉంటాయి. అవి మూసుకుపోకుండా ఫిల్టర్లను తరచూ శుభ్రం చేసుకోవాలి. అందులో శాండ్ (ఇసుక) ఫిల్టర్‌ను బ్యాక్‌వాష్ పద్ధతిలో శుభ్రం చేసుకోవాలంటే అందులో ఉంటే నాలుగు వాల్వ్‌ల గురించి తెలుసుకోవాలి. సిస్టమ్ నడుస్తున్నప్పుడు 2, 4 నంబర్ వాల్వులు తెరచి 1,3 నంబర్ వాల్వులు పూర్తిగా మూసివేసి నీటిని పంపడం ద్వారా నీళ్లు, ఇసుక బెడ్ ద్వారా ప్రవహించడం వలన శుభ్ర పడతాయి. రెండో పద్ధతి ప్రకారం ఇసుక బెడ్‌లోని ఖాళీలు మూసుకుపోయినప్పుడు ముందుగా 1,3 నంబరు గల వాల్వులు తెరచి తర్వాత 2,4 నంబర్ గల వాల్వులు మూసేసి నీటిని నింపడం ద్వారా అందులో మలినాలు 1వ నంబర్ వాల్వు ద్వారా బయటకు పోయి ఇసుక బెడ్ శుభ్రమవుతుంది. ఈ పద్ధతిని శాండ్ ఫిల్టర్ అమర్చిన రెండు ప్రెషర్‌గేజ్‌లను మధ్య తేడా 0.5 కిలో లేదా 0.5.సెం.మీ కన్నా ఎక్కు పెరుగుతున్నప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఫిల్టర్ ఇసుక ఉండాల్సిన మట్టానికి తక్కువైనప్పుడు తిరిగి మట్టాని వరకు నింపుకోవాలి. బ్యాక్‌వాష్ చేసే ముందు శ్యాండ్ ఫిల్టర్ మూత తెరచి చేతులతో ఇసుక బెడ్‌ను కలియబెట్టాలి. ఇలా చేయడం వలన ఫిల్టర్‌ను తొందరగా శుభ్రం చేసుకోవచ్చు.

స్క్రీన్ ఫిల్టర్ శుభ్రం ఇలా..

సిస్టమ్ నడుస్తుండగా స్క్రీన్ ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవాలి. ఫిల్టర్ కింది భాగంలో అమర్చిన డ్రైన్ వాల్వును తెరిస్తే స్క్రీన్‌మెష్‌పై ఉన్న మలినాలు ఈ వాల్వు ద్వారా బయటకు పోతాయి. చాలాసార్లు మలినాలు ఫిల్టర్ మెష్‌పై పేరుకుపోయి మెష్‌పైనే అంటుకొని ఉంటాయి. అలాంటప్పుడు పంపు ఆఫ్ చేసి ఫిల్టర్ మూతను తెరచి ఫిల్టర్‌లోని మెష్‌ను బయటకు తీసి పేరుకపోయిన మలినాలను సున్నితమైన ప్లాస్టిక్ బ్రష్ లేదా చేతి వేళ్లతో శుభ్రం చేయాలి.(మెష్ చిరిగిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి) స్క్రీన్ ఫిల్టర్‌లో మెష్ లేకుండా నడపకూడదు. పేడ, ఇతర సేంద్రియ ఎరువులను డ్రిప్ ద్వారా పంపకూడదు. దీని వల్ల ఫిల్టర్లు, డ్రిప్పర్లు మూసుకుపోతాయి. ఇక పీవీసీ పైపులు, లేటరల్ పైపులు శుభ్రం చేసుకొనేందుకు ఎండ్‌క్యాప్ లేదా ఎండ్‌ప్లగ్ ప్రతివారం లేదా కనీసం 15 రోజులకోసారి తెరచి నీటిని పూర్తి ప్రెషర్‌తో లోపలికి పంపితే తెరచి ఉంచినప్పుడు ఎండ్‌ప్లగ్ చివర్ల ద్వారా మలిన పదార్థాలు బయటకు కొట్టుకపోతాయి. మూడు నెలలకొకసారి లేదంటే కనీసం ఆరు నెలలకు ఒకసారి కచ్చితంగా యాసిడ్ ట్రీట్‌మెంట్(ఆమ్లచికిత్స) ద్వారా డ్రిప్ యూనిట్‌ను బాగా శుభ్రం చేసుకోవాలి. యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే పాడైపోయే ప్రమాదం ఉంటుంది.